చల్లని పండు.. మంచి డిమాండు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఊపందుకున్న పుచ్చకాయల విక్రయాలు
- రోడ్ల వెంట తాత్కాలిక షాపులు
- రూ.వేలల్లో వ్యాపారం



పుచ్చకాయలు భారీగా విక్రయాలు..

బాపట్ల అర్బన్ : శీతాకాలం నుంచి వేసవిలోకి చేర్చే మార్చి నెల పూర్తికావస్తోంది. చలికి దుప్పటి కప్పుకునే రోజులు పోయి.. ఉక్కపోతతో తడిసి పోయే ఎండాకాలం దగ్గరపడింది. ఒంటిలోని నీరంతా.. సూర్యుడి తాపానికి శ్వేదంలా ఆవిరయ్యే ఉష్ణోగ్రతలు ఇప్పటి నుంచే భయపెడుతున్నాయి. మే మొదలవ్వక ముందు... భానుడి భగభగల నుంచి ఉపశమనం పొంది చిల్ అయ్యేందుకు పుచ్చకాయల వైపు బాపట్ల పట్టణ ప్రజలు పరుగులు తీస్తున్నారు. 92 శాతం నీరుండే పుచ్చకాయకు ప్రస్తుతం విపరీతంగా డిమాండ్ పెరిగింది. మండుటెండలో అలసిన శరీరాలకు ఎర్రని ఒక్క పుచ్చ దబ్బ తింటే.. ఆ ఆనందమే వేరు. ఎండలకు ప్రజల 'తపన' తీర్చి..చలువ నిచ్చేందుకు రోడ్ల పక్కన పుచ్చకాయలు గుట్టలు గుట్టలుగా సిద్ధంగా ఉన్నాయి.


తాత్కాలిక గుడారాలేసి, తోపుడు బండ్లపై పుచ్చకాయలను వ్యాపారులు జోరుగా విక్రయిస్తున్నారు.

బాపట్ల పట్టణంలోని దుకాణాల్లో పెద్ద మొత్తంలో హోల్‌సేల్ పుచ్చకాయల వ్యాపారం సాగిస్తున్నారు వ్యాపారులు. ఇక్కడి నుంచి చుట్టు పక్కల మండలాలకూ సరఫరా చేస్తున్నారు. పుచ్చకాయలను ఎక్కువగా చెన్నై, పుదిచ్చేరి నుంచి తీసుకువస్తున్నట్లు వారు చెబుతున్నారు. పట్టణంలో చిన్న చిన్న దుకాణాలకు రీటైల్‌గా విక్రయిస్తున్నారు. వీటితో పాటు దాదాపు తోపుడు బండ్ల ద్వారా రహదారుల వెంట పుచ్చకాయలు, పుచ్చదబ్బలు అందిస్తున్నారు. పుచ్చ వ్యాపారంలో రూ.లక్షల్లోనే సాగుతోంది. గత 20 రోజుల్లో ఆరు లోడుల పుచ్చకాయలు విక్రయించినట్లు ఓ వ్యాపారి చెప్పాడు.

సైజ్‌ను బట్టి రేటు

రీటైల్‌గా పుచ్చకాయ సైజును బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ఈ ధర రూ.100, రూ.150, రూ.200వరకూ ఉంది. మరీ చిన్నవైతే కాస్త తక్కువ ధరకు ఇచ్చేస్తున్నారు. ఒక పుచ్చ దబ్బ అయితే రూ.10, 20 లెక్కన అమ్ముతున్నారు.

ఆరోగ్యానికి మంచిది



పుచ్చకాయలో 92 శాతం నీరు ఉండటంతో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ కమలాకర్, బాపట్ల

వ్యాపారం ఊపందుకుంది



బాపట్ల జీబీసీ రోడ్‌లో దుకాణం ఏర్పాటు చేసి పుచ్చకాయలు విక్రయిస్తున్నా. ఎండలు పెరు గుతుండటంతో పుచ్చకాయల వ్యాపారం ఊపందుకుంది. కాయ రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నా. రోజుకు రూ.20వేల వరకు వ్యాపారం జరుగుతోంది.

–మేడి బోయిన రాఘవమ్మ, పుచ్చకాయల వ్యాపారి

క్లుప్తంగా

ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన



నిజాంపట్నం: ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏపీజేఏసీ, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపు మేరకు బాపట్ల జిల్లా చైర్మన్ కె.రాజారమేష్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, డీటీ ఇక్బాల్, హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, ఏపీఆర్ఎస్ఏ రేపల్లె డివిజన్ వైఎస్ ప్రెసిడెంట్ హని, ఆంజనేయులు, వీఆర్వో శామ్యూల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పడవల కాలువ వంతెనపై రక్షణ ఏర్పాట్లు



కొల్లూరు: శిథిలమైన పడవల కాలువ వంతెన గ్రిల్ స్థానంలో ఇరిగేషన్ శాఖాధికారులు నూతన గ్రిల్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల భారీ ఊక లారీల రాకపోకల కారణంగా వంతెనపై ఉన్న పాతకాలపు ఇనుప గ్రిల్ శిథిలమవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాద పరిస్థితులపై మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఇరిగేషన్ శాఖాధికారులను అప్రమత్తం చేయడంతో యుద్ధప్రాతిపదికన నూతన గ్రిల్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు.

నేడు జిల్లెళ్లమూడి అమ్మ జయంతి



బాపట్ల అర్బన్: జిల్లెళ్లమూడి అమ్మ శత జయంతిని పురస్కరించుకొని ఆదివారం అమ్మవారి శోభయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక చీలురోడ్డులోని రామాలయం వద్ద నుంచి శోభయాత్ర కొనసాగుతుందన్నారు. ఎమ్మెల్యే కోనా రఘుపతి, ఆధ్యాత్మికవేత్త వీఎస్ఆర్ మూర్తి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ నందవనం శ్రీనివాసరావు అమ్మతత్వంపై, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ, వరలక్ష్మి ప్రసంగిస్తారని చెప్పారు. సభలో విశ్వజనీన పరిషత్ ట్రస్టు చైర్మన్ ఒ.నరసింహమూర్తి, సభ్యులు పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కొండముది ప్రేమ్‌కుమార్, అన్నాప్రగడ భాస్కర్, సుబ్బులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షకు 337 మంది విద్యార్థులు హాజరు

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్ష నిఘా నీడలో నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 360 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 23 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎస్కే జుభేర్ తెలిపారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం, చందోలు, ఖాజీపాలెం కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలోని సీఎం డాష్‌బోర్డుకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. పరీక్షలు పూర్తి పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద మహిళా పోలీసులు, చందోలు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ



రేపల్లె: నేషనల్ ఆస్ట్రోనమీ సైన్స్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో 2022–23 విద్యాసంవత్సరానికి ఇటీవల నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని భాష్యం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థానిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ఈ ఒలింపియాడ్‌లో పాల్గొనగా 9 మంది బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జోనల్ అధికారి హృదయరాజ్, హెచ్ఎం లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు జాబితా ప్రదర్శన



ఈ–పంట జాబితాను పరిశీలిస్తున్న సర్పంచ్ రవి కిరణ్మయి, రైతులు

భట్టిప్రోలు: రబీ సీజన్‌లో ఈ–పంట నమోదు చేసిన రైతుల జాబితాలను భట్టిప్రోలు–1, 2 సచివాలయాల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దారా రవి కిరణ్మయి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ సచివాలయాలలో ఈ జాబితాలను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. రైతులు జాబితాలను పరిశీలించి తప్పులు ఏమైనా దొర్లితే సవరణ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.రజని, పి.రత్నరాజు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు

కర్లపాలెం: డ్వాక్రా మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం మండల సమైఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షతన వీవోఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మూడవ విడత నగదును ఈ నెల 25న సీఎం జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా విడుదల చేస్తారని తెలిపారు. కర్లపాలెం మండలంలో మొత్తం 1.081 గ్రూపులకు సంబంధించి రూ.9 కోట్ల 81 లక్షల నగదు డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. వైఎస్సార్ ఆసరా నగదును సభ్యులు వినియోగించుకుని కుటీర పరిశ్రమలు, చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి సాధించే విధంగా గ్రామ వీవోఏలు డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో మొత్తం డ్వాక్రా గ్రూపులకు సంబంధించి ఆసరా పథకంలో రూ.39 కోట్ల నగదు వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు రెండు విడతల వైఎస్సార్ ఆసరా నగదు డ్వాక్రా మహిళల అకౌంట్‌లలో జమైందని, మూడవ విడత ఈ నెల 25వ తేదీ మహిళల అకౌంట్‌లలోకి జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరరావు, లక్ష్మీసోమేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు ప్రారంభించాలి

ఆర్డీవో పార్థసారథి



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె: జగనన్న కాలనీలో నూరుశాతం గృహ నిర్మాణాలు ప్రారంభించేలా సచివాలయ సిబ్బంది లబ్ధిదారులను చైతన్యపరచాలని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. పట్టణంలోని 18వ వార్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కొంత మంది లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. మరికొంత మంది లబ్ధిదారుల గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన లబ్ధిదారులు గృహనిర్మాణాలు వెంటనే ప్రారంభించుకుని త్వరితగతిన పూర్తి చేసుకునేలా చైతన్యపరచాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, హౌసింగ్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు 25 శాతం సీట్లు

బాపట్ల అర్బన్: విద్యాహక్కు (ఆర్టీఈ) చట్టం కింద రాష్ట్రంలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపుపై ప్రభుత్వం ఫిబ్రవరి 26న జీవో 24ను విడుదల చేసిందని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు శనివారం వెల్లడించారు. ఈ జీవో ప్రకారం ఐబీ (అంతర్జాతీయ), ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ మేనేజ్‌మెంట్ల స్కూళ్లన్నింటిలోను విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను అర్హులైన పేదలకు కేటాయించాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి మార్చి 4న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల వారు మార్చి 6 నుంచి 19 వరకు హెచ్‌టీటీపీ://సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 13 నుంచి 17 వరకు చేపడతారని పేర్కొన్నారు. మొదటి విడత కేటాయింపు ఏప్రిల్ 18న ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఏప్రిల్ 19 నుంచి 25వ తేదీలోపు ఆయా స్కూళ్లలో చేరికలను ఖరారు చేసుకోవాలి. రెండో విడత సీట్ల కేటాయింపు ఏప్రిల్ 29న చేపడతారన్నారు. ఈ విద్యార్థులు మే 1 నుంచి 5వ తేదీలోపు ఆయా స్కూళ్లలో చేరాల్సిఉంటుందన్నారు. ఈ ప్రవేశాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నంబరు 14417ను సంప్రదించాలని తెలిపారు. ఈ స్కూళ్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్కో విద్యార్థికి పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, రూరల్ ప్రాంతాల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 చొప్పున చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో సీట్లు పొందిన విద్యార్థులు ఆయా స్కూళ్లకు చెల్లించాల్సిన ఫీజును నిబంధనలననుసరించి అమ్మఒడి పొందిన అనంతరం విద్యా సంవత్సరం చివర రీయింబర్స్ చేస్తారని వెల్లడించారు. తల్లిదండ్రులు చెల్లించకపోతే ప్రభుత్వం ఆ మొత్తాన్ని తదుపరి అమ్మఒడి నుంచి మినహాయించి స్కూళ్లకు చెల్లిస్తుందని తెలిపారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఏడాదికి గ్రామాల్లో రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆర్థిక బలహీన వర్గాలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారన్నారు. రిజర్వేషన్లలో విద్యార్థులు లేకపోతే మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయిస్తారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మొదట ఎస్టీలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అకాల వర్షంతో ఇక్కట్లు



భట్టిప్రోలులో కురుస్తున్న జోరువాన

భట్టిప్రోలు: అకాల వర్షాలకు ఓ వైపు రైతులు, మరో వైపు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం కూడా జోరువాన కురిసింది. వర్షంతో రహదారులు జలమయమై గుంతల్లో వర్షంనీరు చేరాయి. మొక్కజొన్న రైతాంగం ఈ వర్షం ఎప్పుడు వీడుతుందా అని దేవుడిని మొక్కుతున్నారు. భట్టిప్రోలులో అత్యధికంగా 43.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జి సహాయ గణాంకాధికారి కొండలరావు తెలిపారు.

రేపల్లెలో 66.2 మిల్లీమీటర్ల వర్షపాతం

రేపల్లె రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు కొంత మేరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం నాటికి రేపల్లెలో 66.2 మిల్లీమీటర్లు, నిజాంపట్నం మండలంలో 35.4 మిల్లీమీటర్లు, నగరం మండలంలో 37.6 మిల్లీమీటర్లు, చెరుకుపల్లి మండలంలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అకాల వర్షంతో మొక్కజొన్న పంటకు కొంత ప్రయోజనం ఉన్నా మినుము, పెసర పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వ్యవసాయ అధికారులు మండలంలోని కారుమూరు, పేటేరు, నల్లూరుపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలిచ్చారు.

నీరు నిల్వచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చెరుకుపల్లి: మినుము, పెసర రైతులు ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ తెలిపారు. మండలంలోని నడింపల్లి గ్రామంలో శనివారం మినుము, పెసర పొలాలను ఆయన పరిశీలించారు. సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇప్పటి నుంచి వర్షం పడితే రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదపూడి(వేమూరు): పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ అన్నారు. మండలంలోని దాతల సహకారంతో పెదపూడి, ఇంటూరు, గోవాడ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల మంగమ్మ, సాంబశివరావు దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు ఉప్పల షణ్ముఖరావు సహకారంతో ఈ వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రంగారావు, తోలు లక్ష్మీనారాయణ, కుంభం మహిధర్‌తేజ, మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్‌కుమార్, కొడవలి ప్రకాశం, కుంభం బుచ్చిరాజు, చేకూరి శ్రీను, మోర్ల మునలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

చెరుకుపల్లి: పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ డి.వెంకట కొండారెడ్డి తెలిపారు. మండలంలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న రెండు పరీక్షా కేంద్రాలను ఎస్ఐ శనివారం పరిశీలించారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ బ్రహ్మం, మహిళా పోలీసులు ఉన్నారు.

కార్మిక శాఖాధికారిణికి ఉగాది పురస్కారం

భట్టిప్రోలు: ఉత్తమ సేవలు అందిస్తున్న రేపల్లె సహాయ కార్మిక శాఖాధికారిణి వి.సాయిజ్యోతికి ఈ నెల 21వ తేదీ భట్టిప్రోలులో ఉగాది పురస్కారం అందించనున్నట్లు ఏపీ వడ్రంగి (కార్పెంటర్స్) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పంచామృత స్నపన, విశేష పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో కోన రమాదేవి, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు జీడుగు సోమయ్య, కొలను మోహన్, వక్కలగడ్డ శ్రీనివాసరావు, ఆలయ అర్చక స్వామి శ్రీనివాసుల వికస్వన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత–2023 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె: ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత–2023 అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్–2023లో భాగంగా పారిశుద్ధ్య, ఘన వ్యర్థాల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ పరిశుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడిచెత్త వినియోగం వంటి విభాగాల కింద కృషి చేస్తున్న వివిధ కేటగిరీలలో మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 22వ తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఎంపీపీ యారం వనజ



కర్లపాలెం: మండల పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ యారం వనజ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండలంలో ఎంపీటీసీలకు కేటాయించిన నిధులకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ అధికారులు వర్క్‌ఆర్డర్లు ఇవ్వటం లేదని ఎంపీపీ తెలిపారు. మండలంలో పనిచేస్తున్న వీఆర్ఏఈ అందుబాటులో ఉండటం లేదని ఎంపీటీసీ నిధులకు సంబంధించి పనుల వివరాలను అడిగితే డీఈని సంప్రదించాలని ఏఈ చెబుతున్నారని ఎంపీపీ వనజ ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ చేసి డీఈని అడిగితే ప్రస్తుతం ఆ పనులను నిలిపివేయమన్నారని చెబుతున్నారని, ఎవరు నిలిపివేయమన్నారు?, ఎందుకు నిలిపివేయమన్నారు? అనే వివరాలు చెప్పడం లేదని వనజ తెలిపారు. మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఒక ఎంపీటీసీకి మాత్రమే పనులు చేసేందుకు పంచాయతీరాజ్ అధికారులు వర్క్ ఆర్డర్లు ఇచ్చారని, మిగతా వారికి ఎందుకు ఇవ్వడం లేదో తెలియడం లేదన్నారు. అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసి మాట్లాడతామని ఆమె తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



జీవధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



ప్రతిష్టించిన పట్టాభిసీతారామస్వామి విగ్రహాలు

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామంలో శనివారం పట్టాభి సీతారాముల సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితులతో ప్రత్యేక హోమాలు, పూజలు జరిపిస్తున్నారు. శుక్రవారం స్వామివారి విగ్రహాలకు జలాదివాసం, ధాన్యదివాసం, క్షీరాదివాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 10:05 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ట అనంతరం జీవధ్వజ స్తంభం, విమాన గోపురశిఖర, యంత్ర ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ముత్యాలతలంబ్రాలు వేడుక నిర్వహించారు. 5 వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బుకూటి మాధవరావు, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్వినిశ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొలగాని సుబ్బారావు, కూసంపూడి దేవేంద్రరాజు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు.

త్వరగా జగనన్న ఇళ్లు నిర్మించుకోవాలి

మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జె.హనుమంతరావు



మాట్లాడుతున్న డాక్టర్ జె.హనుమంతరావు, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

ఓలేరు(భట్టిప్రోలు): జగనన్న కాలనీ లే–అవుట్లలో లబ్ధిదారులు త్వరగా గృహాలను నిర్మించుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జె.హనుమంతరావు కోరారు. హౌసింగ్ డేను సందర్భంగా శనివారం భట్టిప్రోలు మండలం ఓలేరు లే–అవుట్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు పడలేదని లబ్ధిదారులు చెప్పుకొచ్చారు. బిల్లులు పడకపోవడంపై గృహ నిర్మాణ శాఖాధికారులను ప్రశ్నించగా జీరో బ్యాలెన్స్ ఖాతాల్లో బిల్లులు పడ్డాకానీ వెనక్కి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు. ఖాతాల్లో ఒకరిద్దరికి బిల్లులు పడి వెనక్కి వెళ్లినంత మాత్రాన గృహ నిర్మాణాలు ఆపడం పరిష్కారం కాదని పేర్కొన్నారు. విష ప్రచారాన్ని నమ్మకుండా లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలని, ఇందుకు తాను పూర్తి భరోసా కల్పిస్తానని చెప్పడంతో 15 మంది గృహాలు కట్టుకునేందుకు ముందుకు వచ్చారు. సమావేశంలో సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు రావూరి సౌమ్య, శివకృష్ణ, శేతు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.